నువ్వయితే ఏంజేస్తావు?

చేసిన పాపం చెపితే పోతుందంటారు. నేను కాంగ్రెసు వ్యతిరేకినని గాంధీ పటం నెత్తిన పెట్టుకు ప్రమాణం చేసిన మాట నిజమే. పీకెమీది కొచ్చినాక చావనా? అటువంటి అగత్యం నా జీవితంలో కలుగుతుందని నేను కలగన్నానా? పోలీసు వగైరా అపాయకర శక్తులు సుస్థిరంగా కాంగ్రెసు పక్షాన ఉంటాయని తెలిసేగదా నేను ఖచ్చితంగా కాంగ్రెసు పక్షాన నిలబడి వున్నది? నాకేం రాజకీయాలు తెలిసేడుసునని? స్వరాజ్యం రాకమునుపు దైవం మీదే భారంవేసి కాంగ్రెసు ఉద్యమాలన్నిటినీ తిట్టినవాణ్ణేగా? అటువంటప్పుడు నన్ను మీరు అపార్థం చేసుకుంటే ఎట్లా? నేనెప్పుడూ గెలిచే పక్షమే ఉంటాను. నావల్ల బలవంతుల కెప్పుడూ అపాయం వుండదు. మామూలు పోట్లాటల్లో కూడా నేను నాలుగు తినేవాణ్ణే. రెండు వేస్తానుగాని, వేసేవాడి జోలికి పోనే.

అటువంటి వాడికి నాకే ఎందుకు జరగాలి ఈ పాడు పరీక్ష? ఆ లోకోత్తర పురుషులు నా దగ్గరికే ఎందుకు రావాలి? వారి ప్రశ్నలకు నేనెందుకు సమాధానం చెప్పాలి? ఏమో నాకు తెలీదంటే పొయ్యేదానికి వాళ్ళుకూడా కాంగ్రెసు పక్షపాతులల్లే కనపడేసరికి నేను గోతిలో పడ్డాను. ముఖ్యంగా ఆంజనేయస్వామి వారి వాలకం చూసేసరికి.

ఇట్లా చెప్పకపోతే జరిగిన విషయం మీకేమీ బోధపడదు. అందుకని జరిగిన విషయం జరిగినట్టు మీకు మనవి చేస్తాను. నావల్ల ఎట్టి దోషమైనా ఉంటే దండించండి.

ఆరోజు రాత్రి నా కెంతసేపటికీ నిద్ర పట్టలేదు. అసలే ఇల్లు బిక్కుబిక్కుమంటోంది. మా ఆవిడ పిల్లలతో సహా ఆ సాయంకాలమే పుట్టింటికి వెళ్ళింది, చెల్లెలికి పురుడు వస్తోందని. 'రేపు ఉదయం వెళ్ళవే' అంటే వింటా? అంత ఇంటికి బిక్కు బిక్కుమంటూ నేనొక్కణ్ణే. అసలే నాకు చీకటంటే భయం. దొంగాళ్ళ మాట జ్ఞాపకం వచ్చినా కమ్యూనిస్టుల మాట జ్ఞాపకం వచ్చినా ఇక రాత్రికి జాగారమే అనుకోండి. అందుచేత ఎంతకీ నిద్ర పట్టలేదు. నిమిషాలు లెక్కపెట్టాను. నేను లెక్కపెడుతున్నవి సెకండ్లా అనిపించింది. ఎన్నివేల నిమిషాలు లెక్కపెట్టినా ఒక గంట కాదాయె!

పన్నెండు గంటలు కూడా విన్నాను. మా గడియారం పన్నెండు గంటలూ తీరా

కొట్టిందో లేదో దభీమని చప్పుడయింది. నా గుండె కాస్తా ఆగిపోయింది. వొణుకుతూ కళ్ళు గట్టిగా మూశాను.

"అబ్బాయ్! చూడు బాబు!"

ఆ గొంతు వినగానే భయం పోయినట్టయింది. కళ్ళు తెరిచి చూద్దును గదా నాటకంలో వేషంలాగా ఎదుట నిలబడి ఉన్నాడు - చెమ్కీ కోటు, చెమ్కీ లాగూ, మెడలో చౌకరకం పూసల దండలూ, మొహానికి అరదళం - ఎన్నడో నేను నా పసితనంలో చూసిన హరిశ్చంద్రుడి వేషంలా ఉన్నాడు. ఆ పాత్రధారి ఎవడు? ఈ వేళ నా యింట్లోకి ఎట్లా వచ్చాడు? ఎక్కణ్ణుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? ఇలాంటి సందేహాలెన్నో నాకు కలిగాయి.

"ఎవరు మీరు?" అన్నాను.

"నేను హరిశ్చంద్రుణ్ణి నాయనా? నీవల్ల ఒక ఉపకారం కావాలి."

నన్ను వెర్రిబాగులవాడికింద కట్టిన ఆమనిషిని చూస్తే నాకు నవ్వూ, కోపమూ కూడా వచ్చింది.

"అట్లాగండీ, హరిశ్చంద్రుడుగారూ! మీరు రావటం ఎక్కడినుంచి?"

"దేవేంద్రుడి సభనుండి బాబూ. ఒక చిన్న అన్వేషణమీద దేవేంద్రుడి కోరికపై వచ్చాను. ఇంతకాలానికి ఈ పుణ్యభూమిలో సత్యమే ప్రాతిపదికగా రాజ్యం ఏర్పడిందట. ఈ రాజ్యం తాలూకు వివరాలు కనుక్కొని వచ్చి చిన్న రిపోర్టు తయారు చెయ్యమనీ, మరొకర్నీ మరొకర్నీ పంపితే తనకంత నమ్మకం ఉండదనీ దేవేంద్రుడు నన్ను కోరాడు. నేను కాదనలేకపోయాను" అన్నాడాయన. "ఏం వివరాలు కావాలి మీకు?" అన్నాను.

"మీరు నిజంగా సత్య రాజ్యంలోనే ఉన్నారా?"

"మీకా సందేహం దేనికి? మా జాతీయ మాటో - క్షమించండి మాటో అనే ఇంగ్లీషు మాటకు సరిఅయిన తర్జుమా తెలియదు సత్యమేవజయతే అని!"

"నిజమా! ఆహా ఎంత అదృష్టవంతులు నాయనా మీరు. నేనారోజుల్లో సత్యసంధత మీద నిలబడ్డానంటే బొత్తిగా ఒంటరిగాణ్ణి. నాకొక్క పురుగు తోడులేదు. మీ ప్రభుత్వమే 'సత్యమేవ జయతే' అంటున్నదా? కొంపతీసి 'సత్యమేవజయతీ' అనడంలేదుగదా. ఎందుకంటే" అని అన్నాడాయన.

"లేదులెండి. ఎక్కడన్నా అచ్చు తప్పులు రావలసిందేగాని 'జయతే' అనే అంటున్నాం. కష్టపడి సాధించిన స్వాతంత్ర్యాన్నన్నా వదలుతారుగాని కాంగ్రెసువారు సత్యాన్ని మట్టుకు వదిలిపెట్టరు."

"అట్లాగే ఉండాలి నాయనా, నేను సత్యంకోసం రాజ్యాన్ని, భార్యా బిడ్డలనూ వదిలి పెట్టెయ్యలా?"

"నిజమేనండి, మీ నాటకం చాలాసార్లు చూశా చిన్నతనంలో. అందులో మా మేనమామగారు వీరబాహుడి వేషం వేసి జనాన్ని భలే నవ్వించేవాడు."

"వీర బాహుణ్ణి చూసి జనం నవ్వేవాళ్లా? ఏం చిత్రం? అయితే, బాబూ మీరు స్వాతంత్ర్యం కోసం చాలా కష్టపడ్డారా నాయనా?"

"అయ్యో అంతులేని కష్టాలు పడ్డామండీ."

"పోనీ, పాపం, సుఖించాలంటే కష్టపడాలి. నాయనా ఏమేం కష్టాలు పడ్డారో కొంచెం టూకీగా చెబుతావూ, రాసుకుంటాను!"

ఆ మానవుడు జేబులోంచి పుస్తకం తియ్యసాగాడు.

"ఆ రాజకీయాలు నాకంత బాగా తెలీవండి, మీరు మా కాంగ్రెసు నాయకులను కలుసుకుంటే అవన్నీ వారు వివరంగా చెప్పగలుగుతారు."

"అట్లాగా? సరేలే! నేను వెళ్ళి అక్కడక్కడా నాకు కావలసిన విషయాలు సేకరించి మళ్ళీపోయేటప్పుడు కనిపించి మరీపోతాను" అన్నాడు సత్యహరిశ్చంద్రుడు, మాటలోనే అంతర్హితౌతూ.

ఆయన మాయమైన మరుక్షణం ఏదో భ్రమపడ్డాననుకున్నాను. హరిశ్చంద్రుడేమిటి? నాదగ్గరికి రావడమేమిటి? తెలుగు అందులోనూ మా జిల్లాభాష, మీదు మిక్కిలి వ్యావహారికం మాట్లాడటమేమిటి?

ఈ మాట అనుకుంటూ కన్ను మూశానో లేదో గదిలోకి వందగ్యాసులైట్లు వచ్చినట్టయింది. బలవంతాన కళ్లు తెరిచి చికిలించి చూద్దునుగదా, ఒక దివ్యపురుషుడు నా ఎదుట నిలబడి ఉన్నాడు. ఆయనను మీరెవరు? అని అడగవలిసిన అవసరం కలగలేదు. నా గదిలో వున్న బుద్ధుడి బొమ్మకు అచ్చమైన నకలు.

"ఏం స్వామీ ఇట్లా దయచేశారు" అన్నాను.

బుద్ధుడికీ తెలుగువచ్చు.

"ఇంద్రలోకం నుంచి వస్తున్నాను. నాయనా, మీ రాజ్యంలో అహింస నూటికి నూరుపాళ్ళూ అమలు జరుగుతుందట. ఇంద్రుడు నన్ను ఆ విషయం చిన్న రిపోర్టు రాయమని పంపాడు."

"అట్లాగాండీ? అందులో సందేహమేమీలేదు. హింసలో విశ్వాసంలేని ప్రభుత్వమంటూ ఉంటే ఈ ప్రపంచంలో మాదే. రష్యా-చైనాల పట్ల మాకెంతో స్నేహభావముండికూడా, వాళ్ళు హింసాయుత విప్లవాలు జరిపారన్న కారణంచేతనే మా

ప్రభుత్వం ఆ దేశాల సాహిత్యాన్ని బహిష్కరిస్తున్నది. హింసను తగ్గించాలనే ఉద్దేశంతోనే మా ప్రభుత్వం హింసావాదులను అంటే కమ్యూనిస్టులెండి - ఏమీ తప్పుచేయకుండానే బొక్కలోకి - అంటే జైల్లో అన్నమాట - తోస్తున్నది. మేం ఒక్క ఇంగ్లీషువాడి రక్తబిందువు చిందకుండా వాళ్లదగ్గిరనుంచి స్వరాజ్యం పుచ్చుకున్నాం. అటువంటి స్వరాజ్యాన్నయినా వొదులుతాంగాని అహింసను మాత్రం వదలం."

"చాలా సంతోషం నాయనా! రాజ్యమెందుకు బాబూజీ? నేను రాజ్యాన్ని అవలీలగా తృణీకరించి ప్రేమమార్గం కనుక్కున్నాను."

"మీరు కాంగ్రెసు నాయకులను కలిసి మాట్లాడితే అంతా బోధపడుతుంది."

"అట్లాగే, నాయనా, నువుచెప్పిన ఈ రెండుముక్కలూ నాకెంతో సంతోషం కలిగించాయి. అయితే, చూడు, బాబూ! అహింసా చిహ్నం ఏదైనా మీదేశంలో ఉందా?"

"లేకేమండి? మా జెండామీద ధర్మచక్రం ఉంది."

"అశోకుడిదేనా, బాబూ?"

"అవునండీ, అవును!"

"మంచిది, నాయనా! అశోకుడే హింసద్వారా అహింసను చేరుకున్నాడు."

"మా కాంగ్రెసువారు ముందే అహింసను అవలంబించారు"

"భేష్! బాగుంది! వస్తా నాయనా! మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు నిన్ను చూసి మరీ దేవేంద్రలోకం పోతా!"

ఒక్కసారిగా కాంతి మాయమైంది. కళ్ళు చీకట్లు కమ్మాయి. మళ్ళీ నాకళ్లు గుడ్డిదీపపు వెలుతురు అలవాటుపడ్డ తరువాత ధైర్యంగా కళ్లు మూశాను. కన్ను ఇట్లా మూశానో లేదో కప్పు విరిగి మీద పడిందనుకున్నాను. అంతభయంకరమైన చప్పుడై, భూమి కంపించింది. కళ్లు తెరచి చూద్దునుగదా ఆంజనేయులవారు ఎదుట ప్రత్యక్షం. మూడు మూర్తులా రవివర్మ గీసిన ఆంజనేయుడే.

"ఏం స్వామీ, ఇట్లా దయచేశావు?"

నామాట వినిపించుకోలేదు. అటూ ఇటూ ఊగుతూ "రామ రామ రామ సీతా" అని పాడుతున్నాడు. నేను నోరు తెరచి అతనికేసి చూస్తున్నాను. చిన్నప్పుడు చూసిన సి.యస్.నటేశం హనుమంతుడికీ, ఈ అబ్బికీ చాల పోలికలున్నాయి. అంతే ఎత్తుకూడా ఉన్నాడు. పాడుతూ పాడుతూ నా మీదకురికి గొంతు పిసకపోయినాడు.

"ఆగు, ఆగు ఏమిటీ దౌర్జన్యం?" అన్నాను.

"ఇది రామరాజ్యంకాదూ?"

"అవును అయితే?"

"నేను రాంభజన చేస్తుంటే నువుకూడా చెయ్యవేం? నువ్వుచూస్తే దేశద్రోహిలా ఉన్నావు! చంపేస్తా? ఎవడనుకున్నావో? రామబంటును!"

"ఎట్లా! ఏం వచ్చారు తమరు?"

"ఇక్కడ రామరాజ్యం ఎట్లా అమలు జరుగుతుందో చూసిరమ్మని దేవేంద్రుడు నన్ను పంపాడు. రాముడి తరువాత ఇంతకాలానికి మళ్ళీ రామరాజ్యం ప్రపంచంలో ఏర్పడిందంటే నాకు పరమానందంగా ఉంది. రామ రామ రామ సీతా!"

మళ్ళీ పాటలో పడ్డాడు.

"అవును రామభక్తాగ్రేసరులైన అనేకమంది అయ్యంగార్లు ప్రభుత్వంలో ఉన్నారు అంటే వైష్ణవస్వాములన్నమాట."

"రామ రామ రామ సీతా! ఈ దేశానికి రాజెవరు?"

"రాజులుండరు, ఇది రిపబ్లిక్ అంటే ప్రజారాజ్యమన్నమాట. అంటే ప్రజలే రాజులు!"

"హో రామా! నీ ఆశయం నెరవేరిందయ్యా నువు రాజువై ఉండి ప్రజాభిప్రాయాన్ని పాటించావు! ఇంతకాలానికి ప్రజలే రాజులై పోయినారు. రామ రామ రామ సీతా!"

"ఈ మధ్యనే ఎన్నికలైనాయి. ప్రజలు కాంగ్రెసు మంత్రులనే ఎన్నుకున్నారు. కాంగ్రెసు మంత్రులను ఎన్నుకోకపోతే రామరాజ్యం పోయే ఉండును. అదృష్టవశాత్తు అట్లా జరుగలేదు."

"రామ రామ రామ సీతా! నేను అట్లావెళ్ళి మీ రామరాజ్యాన్ని స్వయంగా చూసివస్తా. తిరిగి వెళ్లేటప్పుడు మళ్ళీ కనిపిస్తాలే! రామ రామ రామ సీతా! రామ రామ రామ సీతా!"

ఆంజనేయుడి పాట క్రమంగా ఫేడవుట్ అయింది. నేనుకూడా కళ్లు మూశాను. కాని ఇంకెవరు వస్తారో అని నాకు అనుమానంగానే ఉంది. అయితే ఇది వొట్టి అనుమానమే అయింది. ఎందుచేతనంటే ఇంకెవరూ రాలేదు. నేను నిద్రకూడా పోయి ఉండాలి.

ఎందుచేతనంటే నాకు ఈసారి నిద్రా భంగమయినట్టయింది. ఈ సారి నేను లేచింది చప్పుళ్ళకు కాదు. ఆకస్మికంగా వొళ్ళంతా దగ్ధమై పోతున్నట్లనిపించింది. ఏదో పీడకల వచ్చినట్లుగా వంటిమీద రోమాలన్నీ నిక్కపొడుచుకున్నాయి. శరీరమంతా కంపిస్తున్నది. నాలుక ఎండుకుపోయి పిడచ గట్టింది.

నేను కంగారుగా పక్కలో లేచి కూచునేసరికి ఆ ముగ్గురూ నా ఎదుట వున్నారు. నాకేసి రౌద్రంగా చూస్తున్నారు. వాళ్ళను చూస్తేనే పై ప్రాణాలు పైన పోసాగాయి.

"నాతో అబద్ధాలాడావుట్రా? పాపి!" అన్నాడు హరిశ్చంద్రుడు పళ్లుపటపటా కొరుకుతూ. హరిశ్చంద్రుడేమో నోట్లో నాలుకలేని సత్తెకాలపు మనిషనుకున్నాను. బుద్ధుడు

ఏమీ అనలేదు. కాని ఆయన నాకేసి చూసేచూపు దుర్భరంగా ఉంది. ఇక ఆంజనేయులు వారి సంగతి చెప్పనే అక్కర్లేదు. నిప్పులు తొక్కిన కోతిలాగా, ఇంకోమాట అనటానికి లేదు, చిందులు తొక్కుతున్నాడు. అతని తోక, భయంకరమైన కొండశిలలాగా నామీదికి దూకుతోంది.

"క్షమించండి! నేను అల్పుణ్ణి. మీ ఆగ్రహం తప్పుచేసిన వారిమీద చూపండి."

"మాతో అన్ని పచ్చిఅబద్ధాలెందుకు చెప్పావు?" అన్నాడు హరిశ్చంద్రుడు. నేనేం అబద్ధాలు చెప్పానో నాకు తెలీదు. కాని చెప్పక చెప్పక హరిశ్చంద్రుడికే అబద్ధాలు చెప్పటం ఏమిటి? నా ప్రారబ్ధం కాకపోతే. అబద్ధాలను ఎవరైనా సహిస్తారుగాని హరిశ్చంద్రుడు సహిస్తాడా!

"సత్యమేవజయతే, హా హ్హాహ్హాహ్హా" అన్నాడు హరిశ్చంద్రుడు.

"అహింస, ధర్మచక్రం! హా హ్హాహ్హాహ్హా!" బుద్ధుడు.

"రామరాజ్యం! గుర్ర్ర్ర్" అన్నాడు ఆంజనేయులు.

నేనేం చెయ్యాలి? నాకు మతిపోయింది! వాళ్ళ ఎదుట సాష్టాంగపడ్డాను. నా సుకుమారమైన చర్మాన్ని రక్షించుకునేందుకు నోటికి వచ్చినమాట అనేశాను.

"అయ్యా మీ ఎడల నేను అపచారం చేసి వుండివుండవచ్చు, నాకు నిజంగా రాజకీయాలు తెలియవు. కాకపోయినా నేను కాంగ్రెసు వ్యతిరేకిని, మీరు సి.ఐ.డి లేమోనని భయపడి అట్లా అన్నాను."

వీళ్ళు ఏ రాజకీయ దృక్పథం గలవారో నాకు తెలిసి చావకపోయే. ఏ రష్యా ఏజంట్లయినా అయితే కమ్యూనిస్టునని చెబుదామనికూడా తెగబడ్డాను. చెప్పొద్దూ? కాని ఆ ఇంద్రలోకంలో ఏ రాజకీయాలు తెలిసి ఏడవలేదు. అందుచేత కాంగ్రెసు వ్యతిరేకినని మాత్రం ఊరుకున్నాను. అదే నా ప్రాణాన్ని కాపాడింది. హనుమంతుడి తోక నామీద ఆడటం మానేసింది. బుద్ధుడు నాకేసి తీవ్రంగా చూడటం మానేశాడు. హరిశ్చంద్రుడు కూడా కొంత సౌమ్యంగా మారాడు.

"నువ్వు వెధవ్వి! మీ బతుకు బండారమంతా ఇప్పుడేవెళ్ళి ఇంద్రుడికి చెప్పేస్తాం. ఇక ముందైనా బుద్ధికలిగి మసలుకో, తెలీని విషయాలు మాట్లాడకు" అన్నారు వాళ్ళు.

"పోనీ, ఒక్క సలహా ఇవ్వండి. ఈ మునిసిపల్ ఎన్నికల్లో వోటు ఎటు వెయ్యమన్నారు. ఇప్పుడు కొత్త వార్డులు! మీకు తెలుసుననుకుంటా!"

"నీ వెధవ రాజకీయాలతో మాకు ప్రసక్తిలేదు. మేం మీ సమాజధర్మం తెలుసుకోవటానికి వచ్చాం. అటువంటిదేమీ కనిపించలేదు. పోతున్నాం. మీ జీవితం నరకకూపమల్లే చేసుకున్నారు. అందులోనే పొర్లండి!" అంటూ ఆ త్రిమూర్తులు

అంతర్హితులైనారు. ఇదీ జరిగిన సంగతి. ఈ నా రహస్యం ఎట్లా బయటపడిందో నాకు తెలీదు. దేశభక్తులైన నా స్నేహితులు నన్ను పురుగును చూసినట్టు చూస్తున్నారు. నేను కాంగ్రెసు విరోధినని ఆ దేవతా మూర్తుల ఎదట ప్రమాణం చేసినట్టు ఎట్లా బయటపడిందో నాకే తెలియటంలేదు. ఎంతో గండకత్తెర అయితేనే తప్ప నేనంత మహాపాతకం చేస్తానా? ఇంతమాత్రంచేత నన్ను కాంగ్రెసు నుంచి బహిష్కరిస్తారా? నావంటి వాళ్లకు స్థానం లేకుండా చేస్తే కాంగ్రెసు ఏమయేటట్టు. మీరే ఆలోచించండి, న్యాయం చెప్పండి? నా స్థానంలో ఉంటే మీరేం చేస్తారు?

మొదటి ముద్రణ: విశాలాంధ్ర ఆదివారం సంచిక, 28 సెప్టెంబర్ 1952